
కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
360° SINGLE TOPIC
మహిళలు - రాజకీయాలు
శనివారం • 28.03.2026
పేజీలు: 4

# పురుషాధిక్య రాజకీయాల్లో నారీ భేరీ



పార్టీలు పెట్టి పవర్‌లోకి వచ్చిన ఉక్కు మహిళలు కొందరు..
వారసత్వాన్ని అందిపుచ్చుకున్న వారు మరికొందరు..
తెలంగాణలో తొలి మహిళా పార్టీ 'తల్లి తెలంగాణ'
కవిత పెట్టనున్న పార్టీ చూపబోయే ప్రభావం ఎంత?

"తూర్పున మమత.. పశ్చిమాన వసుంధర.. ఉత్తరాన మెహబూబా.. దక్షిణాన జయలలిత.. దేశాన్ని నలుదిక్కులా ఏలుతున్న నారీశక్తి!"...

ఇదీ ఒకప్పుడు భారత రాజకీయాల్లో వినిపించిన మాట. మెహబూబా ముఫ్తీ, జయలలిత లాంటి కొందరు వారసత్వంగా వచ్చిన పార్టీలకు నాయకత్వం వహించి ముఖ్యమంత్రులయ్యారు.. మమతా బెనర్జీ సొంత పార్టీ పెట్టుకుని సీఎం పీఠాన్ని కైవసం చేసుకున్నారు. పదిహేనేళ్లుగా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. స్వతంత్ర భారత చరిత్రలో ఏకైక మహిళా ప్రధాని ఇందిరాగాంధీ. కాంగ్రెస్ నుంచి విడిపోయి సొంతంగా 'కాంగ్రెస్ ఐ' పేరుతో కొత్త పార్టీ పెట్టుకుని రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు ఆమె.

తెలంగాణలో రాజకీయ పార్టీలు పెట్టిన మహిళలు ఇద్దరే. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సినీ నటి విజయశాంతి 'తల్లి తెలంగాణ' పార్టీని స్థాపించి ఆ తర్వాత టీఆర్ఎస్‌లో విలీనం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ఉన్నారు. రెండో మహిళ వైఎస్ షర్మిల. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'వైఎస్సార్ తెలంగాణ పార్టీ'ని స్థాపించి కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్‌గా కొనసాగుతున్నారు.

బీఆర్ఎస్ నుంచి తెగదెంపులు చేసుకున్న కల్వకుంట్ల కవిత కొత్త పొలిటికల్ పార్టీ ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమం టైమ్‌లో నడిపిన తెలంగాణ జాగృతిని తలపించేలా కొత్త పార్టీకి ఆ పేరే పెట్టాలనుకుంటున్నారు. ఏప్రిల్ 25న లాంఛనంగా పార్టీ పేరును, జెండాను, ఎజెండాను, లక్ష్యాలను ప్రకటిస్తానని శ్రీరామనవమి రోజున వెల్లడించారు. గతంలో ఇద్దరు మహిళలు పెట్టిన పార్టీలు ఇప్పుడు ఉనికిలో లేవు. ఇప్పుడు కవిత పెట్టబోయే పార్టీ లైవ్‌లో ఉన్న ఏకైక 'మహిళా' పార్టీ అవుతుంది.

దేశంలోని ఫక్తు పురుషాధిక్య రాజకీయాలను ధిక్కరించి.. పార్టీలు పెట్టి, జెండా పాతి, అధికారంలోకి వచ్చిన మహిళలు చాలా అరుదు. కానీ, వారి ప్రభావం మాత్రం అంతా ఇంతా కాదు. ఇప్పుడు కొత్తగా వస్తున్న కవిత పార్టీ ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్. గతంలో పార్టీలు పెట్టిన మహిళలు ఎవరు? వారసత్వంగా వచ్చిన పార్టీకి నాయకత్వం వహించిన మహిళలు ఎవరు?! రాష్ట్రాల్లో, దేశంలో వారు చాటిన సత్తా ఏమిటి?..

వీటిపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం...

- తెలంగాణ బ్యూరో, కలం

## చాలెంజింగ్ టాస్క్

తెలంగాణ గడ్డ.. పోరాటాలకు పురిటిగడ్డ. సాయుధ పోరాటం నుంచి మలిదశ ఉద్యమం వరకు మహిళలు ముందు వరుసలో నిలబడ్డారు. రాజకీయాల్లో మాత్రం వాళ్లు ఓటు బ్యాంకుగానే పార్టీలకు కనిపిస్తున్నారు. రాష్ట్రంలోనే కాదు దేశమంతా ఇదే వివక్ష! పాలిటిక్స్‌లో మహిళల భాగస్వామ్యం నామమాత్రంగానే ఉంటున్నది. చట్టసభల్లో వారి సంఖ్య ఇప్పటికీ ఆశించిన స్థాయిలో లేదు. పురుషాధిక్యత ఎక్కువగా ఉండే రాజకీయ క్షేత్రంలో మహిళలు తమ గళాన్ని వినిపించడం ఒక సవాలుగా మారింది. రాజకీయాల్లో కొనసాగడమే కష్టమైన తరుణంలో, సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించి, దానిని నడపడం అనేది తెలంగాణతోపాటు దేశంలోనూ చాలెంజింగ్ టాస్క్! కానీ, కొందరు మహిళలు ఆ చాలెంజెస్‌ను ఎదుర్కొని నిలబడ్డారు. ముఖ్యమంత్రులు అయ్యారు. ఇందిరాగాంధీ అయితే ప్రధానమంత్రి అయ్యారు.

## కల్వకుంట్ల కవిత

విజయశాంతి 'తల్లి తెలంగాణ'ను టీఆర్ఎస్‌లో, షర్మిల 'వైఎస్సార్టీపీ'ని కాంగ్రెస్‌లో విలీనం చేసిన తర్వాత ప్రస్తుతం తెలంగాణలో మహిళా సారథ్యంలో ఏ రాజకీయ పార్టీ లేదు. ఇప్పుడు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పార్టీ రానుండడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీసింది. ఆ పార్టీ ప్రభావం ఎన్నికల్లో ఎలా ఉంటుందని లీడర్లు లెక్కలు వేసుకుంటున్నారు.

- 2025 ఆగస్టులో బీఆర్ఎస్ నుంచి తెగదెంపులు చేసుకున్న కవిత. ఆ పార్టీ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా.
- ఈ నెల 27న శ్రీరామనవమిని పురస్కరించుకుని నిజామాబాద్‌లోని తన నివాసంలో కవిత కీలక ప్రకటన. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మునీరాబాద్‌లోని ఫంక్షన్ హాల్‌లో కొత్త పార్టీ పేరు, విధి విధానాలు వెల్లడిస్తానని స్పష్టీకరణ.
- చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ల కోసం ఆమె చేసిన పోరాటమే ఇప్పుడు రాజకీయ ఎజెండా. ప్రజల ఆకాంక్షలను అధికార, ప్రతిపక్ష పార్టీలు విస్మరించాయని.. బహుజన, అట్టడుగు వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడమే తమ ధ్యేయమని ప్రకటన.
- 2008లో తెలంగాణ జాగృతిని స్థాపించిన కవిత. రెండు దశాబ్దాల పాటు సామాజిక, సాంస్కృతిక సంస్థగా కొనసాగిన జాగృతి ఇప్పుడు రాజకీయ పార్టీగా మారి.. రాష్ట్రంలో మహిళా నాయకత్వంలో నడిచే ఏకైక పార్టీగా అవతరించనుంది.







## విజయశాంతి

1980–90లో విజయశాంతి టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్. లేడీ అమితాబ్‌గా పేరు. 'ఒసేయ్ రాములమ్మ' వంటి సినిమాలతో రికార్డులు బ్రేక్ చేశారు. ఇదే ఆమె రాజకీయ ప్రవేశానికి బేస్. 1998 నుంచి 2004 వరకు బీజేపీలో కొనసాగారు. నాడు పార్టీలో యాక్టివ్‌గా ఉన్నారు. 2005లో బీజేపీని నుంచి బయటికొచ్చి తల్లి తెలంగాణ పార్టీని స్థాపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా పనిచేశారు. మహిళా సమస్యలపై పోరాటం, నల్లగొండ ఫ్లోరైడ్ సమస్యపై ఉద్యమం, సామాజిక న్యాయం అనేవి ఆ పార్టీ ఎజెండా అంశాలు.

- 'తల్లి, బిడ్డ' అనేది విజయశాంతి పార్టీ గుర్తు. 2007లో తెలంగాణ తల్లి భావనను ప్రజల్లోకి తీసుకొచ్చింది 'తల్లి తెలంగాణ' పార్టీనే. అప్పట్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా సాగుతున్నది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నేరవేర్చడమే లక్ష్యంగా విజయశాంతి తన పార్టీని నడిపించారు.
- తెలంగాణ ఓట్లు చీలకుండా ఉండటం, ఉద్యమాన్ని బలోపేతం చేయడం కోసం 2009 జనవరిలో అప్పటి టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) పార్టీలో తెలంగాణ తల్లి పార్టీని విజయశాంతి విలీనం చేశారు.
- 2009లో టీఆర్ఎస్ తరఫున మెదక్ ఎంపీగా విజయశాంతి పోటీ. విజయం. ఆ తర్వాత టీఆర్ఎస్‌తో విభేదాలు.
- 2014లో కాంగ్రెస్‌లో చేరిక. మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ. పద్మా దేవేందర్ రెడ్డి చేతిలో ఓటమి. కొన్ని నెలలు పార్టీ కార్యక్రమాలకు దూరం.
- 2020లో మళ్లీ బీజేపీలో చేరిక. కానీ.. యాక్టివ్ రోల్ లేకపోవడంతో 2023లో మళ్లీ కాంగ్రెస్‌లోకి.. 2025, ఏప్రిల్ 7న ఎమ్మెల్సీగా ప్రమాణం.

## వైఎస్ షర్మిల



తెలంగాణలో విజయశాంతి తర్వాత సొంతంగా రాజకీయ పార్టీ పెట్టిన రెండో మహిళ వైఎస్ షర్మిల. 2021 జులై 8న వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ (వైఎస్ఆర్‌టీపీ)ని స్థాపించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి రోజునే ఆ పార్టీని ప్రకటించారు.

- రాజన్న రాజ్యం (వైఎస్ఆర్ సంక్షేమ మోడల్), నిరుద్యోగం, రైతుల సమస్యలు, మహిళా భద్రత, సంక్షేమం–స్వయం సమృద్ధి–సమానత్వం అనేవి పార్టీ కోర్ ఐడియాలజీలు.
- అన్న వైఎస్ జగన్‌తో విభేదాలు.. కొత్త పార్టీ స్థాపనకు మరో కారణం.
- పార్టీ గుర్తు మోటార్ సైకిల్ (బైక్). ఇది ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఫ్రీ సింబల్. పర్మినెంట్ గుర్తు కాదు. జెండాలో 80 శాతం పాలపిట్ట రంగు, 20 శాతం నీలం రంగు. మధ్యలో తెలంగాణ రాష్ట్రం, వైఎస్సార్ ఫొటోలు.
- పార్టీ స్థాపించిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా ప్రజాప్రస్థానం పేరుతో పాదయాత్ర చేపట్టిన షర్మిల. 2021 అక్టోబర్ 20న చేవెళ్ల నుంచి పాదయాత్ర ప్రారంభం. తెలంగాణలోని దాదాపు అన్ని నియోజకవర్గాలు కవర్. సుమారు 3,800 కిలో మీటర్లకుపైగా నడక.
- ప్రతి మంగళవారం నిరుద్యోగుల కోసం నిరుద్యోగుల నిరాహార దీక్ష పేరుతో నిరసనలు.
- తెలంగాణలో వ్యతిరేక ఓటు చీలిపోవద్దని భావించి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన షర్మిల. కాంగ్రెస్‌కు మద్దతు.
- 2024 జనవరి 4న ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సమక్షంలో వైఎస్ఆర్ టీపీని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో విలీనం చేసిన షర్మిల.
- 2024 నుంచి మొత్తం ఏపీకి షర్మిల పరిమితం. అక్కడ పీసీసీ చీఫ్ గా బాధ్యతలు. లోక్‌సభ ఎన్నికల్లో ఏపీలోని కడప సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ. వైఎస్సార్సీపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డి చేతిలో ఓటమి.

## ఈశ్వరీబాయి



- 1960లలో ఈశ్వరీ బాయి 'సివిక్ రైట్స్ కమిటీ' అనే రాజకీయ వేదికను స్థాపించారు. అప్పట్లో రాజకీయాలకు అతీతంగా పౌర హక్కుల కోసం.. అట్టడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఈ వేదిక పనిచేసింది.
- ఈ కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీ. 1969 మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఈశ్వరీ బాయిది కీలక పాత్ర.
- ఉద్యమ సమయంలో ఏర్పడిన తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్)కు ఉపాధ్యక్షురాలిగా సేవలు. ఆ సమయంలో చంచల్‌గూడ జైలులో ఖైదీగా ఈశ్వరీ బాయి. ప్రత్యేక రాష్ట్రం కోసం అసెంబ్లీ లోపల, బయట ఆమె గళం వినిపించారు.
- అంబేద్కర్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితురాలై రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ)లో ఈశ్వరీబాయి చేరిక. 1967లో తొలిసారిగా నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపు.
- ఆ తర్వాత 1972లో కూడా అదే ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ఆర్‌పీఐ, టీపీఎస్ మద్దతుతో తిరిగి ఎమ్మెల్యేగా ఎన్నిక. ఆర్‌పీఐ జాతీయ అధ్యక్షురాలిగా బాధ్యతలు.
- తెలంగాణలో రాజకీయ పార్టీ పెట్టిన (లేదా స్వతంత్ర వేదిక ద్వారా ఎన్నికల్లో గెలిచిన) తొలి మహిళా నేత ఈశ్వరీ బాయి అవుతారు. ఆమె కుమార్తె గీతారెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా, కీలక నాయకురాలిగా ఎదిగారు.


## లక్ష్మీ పార్వతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మహిళా నాయకత్వం గురించి మాట్లాడేటప్పుడు నందమూరి లక్ష్మీపార్వతి స్థాపించిన పార్టీ గుర్తుకు వస్తుంది.

- ఎన్టీ రామారావు మరణం తర్వాత, తెలుగుదేశం పార్టీలో జరిగిన అంతర్గత పరిణామాలతో పార్టీ పగ్గాలు చంద్రబాబు చేతికి వెళ్లాయి. దీంతో 1996లో 'ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ'ని స్థాపించిన లక్ష్మీపార్వతి.
- అసలైన ఎన్టీఆర్ వారసులం మేమే అని చాటడం, చంద్రబాబు నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ.. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను (రూ.2 కిలో బియ్యం, సంపూర్ణ మద్యపాన నిషేధం) కొనసాగించడమే ఈ పార్టీ ఎజెండా.
- పార్టీ గుర్తు సింహం. టీడీపీ గుర్తు సైకిల్. ఆమె ఎన్టీఆర్ గర్జనకు ప్రతీకగా సింహం గుర్తును ఎంచుకున్నారు. పసుపు రంగు జెండాపై మధ్యలో సింహం గుర్తు.
- 1996 లోక్‌సభ ఎన్నికల్లో ఈ పార్టీకి సుమారు 11 శాతం ఓట్లు వచ్చాయి. ఇది ఏపీ రాజకీయాల్లో ఒక కొత్త పార్టీకి వచ్చిన భారీ ఓటు షేర్.
- 1996 అక్టోబర్ లో శ్రీకాకుళం జిల్లా పాతపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో లక్ష్మీపార్వతి పోటీ చేసి, టీడీపీ అభ్యర్థిపై సుమారు 14,000 ఓట్ల మెజారిటీతో విజయం. ఇది ఆమె రాజకీయ జీవితంలో అతిపెద్ద గెలుపు.
- ఆ తర్వాత 1999 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఏలూరు, సోంపేట రెండు చోట్లా పోటీ చేసి ఓడిపోయారు. 2004లో ఆత్మకూరు నుంచి పోటీ చేసి కూడా ఓటమి పాలయ్యారు.
- లక్ష్మీపార్వతి తన పార్టీని అధికారికంగా వేరే పార్టీలో విలీనం చేయలేదు. కానీ కాలక్రమేణా పార్టీ ఉనికి కోల్పోయింది. కేంద్ర ఎన్నికల సంఘం 2016లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుంచి తొలగించింది.
- లక్ష్మీపార్వతి.. 2011లో వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్‌సీపీ)లో చేరారు. ప్రస్తుతం ఆమె ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.



# మహిళలు - రాజకీయాలు



## మమతా బెనర్జీ



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ‘దీదీ’,‘బెంగాళి కాళిక’గా పేరొందారు మమతా బెనర్జీ. సుమారు రెండున్నర దశాబ్దాలకుపైగా ఆమె జాతీయ కాంగ్రెస్‌లో పనిచేశారు. బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ (కమ్యూనిస్టులు) ప్రభుత్వాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ఫెయిలైందని ఆరోపిస్తూ.. అందులోంచి బయటకు వచ్చి సొంత పార్టీని ఏర్పాటు చేశారు. 2011 నుంచి బెంగాల్‌లో ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

- 1998 జనవరి 1న ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీని స్థాపించిన మమతా బెనర్జీ. ‘మా, మాటి, మానుష్ (తల్లి, మట్టి, ప్రజలు)’ పార్టీ నినాదం. బెంగాల్‌లో సుమారు 34 ఏళ్లుగా కొనసాగుతున్న కమ్యూనిస్టుల పాలనను గద్దె దించడమే అప్పట్లో ఈ పార్టీ లక్ష్యం.
- పార్టీ స్థాపించిన ఏడాదిలోనే లోక్‌సభ ఎన్నికల్లో 7 సీట్లు గెలుపొందిన మమత.
- 1999లో ఎన్డీఏ హయాంలో ప్రధాని వాజపేయి నేతృత్వంలో తొలి మహిళా రైల్వే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మమతా బెనర్జీ.
- 2000 సంవత్సరంలో కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్‌లో తొలిసారి మేయర్ పీఠం కైవసం.
- 2001లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 60 సీట్లు గెలుచుకుని ప్రధాన ప్రతిపక్ష హోదా పొందిన మమతా బెనర్జీ పార్టీ టీఎంసీ.
- 2011 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకు గాను టీఎంసీ ఏకంగా 184 స్థానాల్లో గెలిచి సత్తా చాటింది. 34 ఏండ్ల కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చి.. మమత అధికారంలోకి వచ్చారు. 2011 మే 20న ఆమె పశ్చిమ బెంగాల్‌కు తొలి మహిళా సీఎంగా ప్రమాణం చేశారు. పార్టీని పెట్టి.. అధికారంలోకి వచ్చి సరికొత్త రికార్డు నెలకొల్పారు.
- 2016, 2021లోనూ మమతా బెనర్జీ పార్టీ టీఎంసీనే అధికారంలోకి వచ్చింది. ఇప్పటికీ ఆమెనే సీఎంగా కొనసాగుతున్నారు. తాజాగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నారు.
- జాతీయ రాజకీయాల్లోనూ మమతా బెనర్జీ పార్టీ బలమైన శక్తిగా కొనసాగుతున్నది. 2014లో లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 34 ఎంపీ సీట్లు గెలిచింది. 2016లో తృణమూల్ కాంగ్రెస్ జాతీయ పార్టీ హోదా పొందింది. 2019లో లోక్ సభలో 22 ఎంపీ సీట్లు, 2024 ఎన్నికల్లో 29 ఎంపీ సీట్లు సాధించింది. జాతీయ రాజకీయాల్లో కింగ్ మేకర్ గా మమతనిలుస్తున్నారు.

## ఇందిరా గాంధీ



దేశానికి ఏకైక, తొలి మహిళా ప్రధానిగా పనిచేసిన ఉక్కుమహిళ ఇందిరాగాంధీ. 1966 జనవరి 24న ఆమె ప్రధాని అయ్యారు. కాంగ్రెస్‌లో చీలికలు రావడంతో సొంతగా పార్టీ పెట్టి గెలిచి మళ్లీ ప్రధాని పీఠంపై కూర్చున్నారు.

- నెహ్రూ సిద్ధాంతాలకు, కాంగ్రెస్ అసలు ఆశయాలకు తానే వారసురాలినని.. వాటిని ముందుకు తీసుకెళ్లడమే తన కర్తవ్యమని 1978 జనవరి 2న ఇందిరాగాంధీ సొంత పార్టీ (కాంగ్రెస్– ఐ)ని స్థాపించారు. అప్పుడు ‘హస్తం’ (చేయి) గుర్తు ఎన్నికల చిహ్నంగా మారింది. సామాన్య ప్రజలను, దళితులను, మైనారిటీలను తనవైపు తిప్పుకోవడం కోసం ‘గరీబీ హఠావో’ నినాదం ఇచ్చారు.
- పార్టీ పెట్టిన నెల రోజులకే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించారు. అదే ఏడాది కర్ణాటకలోని చిక్కమంగళూరు ఉప ఎన్నికలో ఇందిర లోక్‌సభకు ఎన్నికై, పార్లమెంటులో మళ్లీ అడుగుపెట్టారు. 1980లో జనతా ప్రభుత్వం పడిపోగా వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో ఇందిరా 353 సీట్లు సాధించి మళ్లీ ప్రధాని అయ్యారు.
- 1981 లో కేంద్ర ఎన్నికల సంఘం ‘ఇందిరా కాంగ్రెస్’ను అసలైన ‘భారత జాతీయ కాంగ్రెస్’గా గుర్తించింది. ఇదే ఇప్పటికీ కొనసాగుతున్నది.

## అనుప్రియా పటేల్



ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కుర్మీ (ఓబీసీ ) సామాజికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ, అతి తక్కువ కాలంలోనే కేంద్ర మంత్రిగా ఎదిగిన నాయకురాలు అనుప్రియా పటేల్. ఆమె 2016 డిసెంబర్ 14న అప్నా దళ్(సోనేలాల్) పార్టీని ఏర్పాటు చేశారు. అసలైన ‘అప్నా దళ్’ పార్టీని ఆమె తండ్రి సోనేలాల్ పటేల్ 1995లో స్థాపించారు. 2009లో ఆయన మరణం తర్వాత పార్టీ బాధ్యతల్లో తల్లి కృష్ణా పటేల్, కూతురు అనుప్రియా పటేల్ మధ్య విభేదాలు వచ్చాయి. అనంతరం అనుప్రియా పటేల్ తన తండ్రి పేరు మీదుగా ‘అప్నాదళ్ (సోనేలాల్)’ కొత్త పార్టీని ప్రారంభించారు.

- ఉత్తరప్రదేశ్‌లో కుర్మీ హక్కుల కోసం పోరాడటం.. వెనుకబడిన తరగతులు, దళితులు, అణగారినవర్గాలకు రాజకీయాల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించడం అప్నాదళ్ (సోనేలాల్) పార్టీ లక్ష్యం.
- బీజేపీతో పొత్తు పెట్టుకుని అనుప్రియా పటేల్ వరుస విజయాలు సాధించారు. ఉత్తరప్రదేశ్‌లో ఆమె పార్టీకి 2022లో స్టేట్ హోదా దక్కింది. ప్రస్తుతం అనుప్రియా పటేల్ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు.

## ఉమా భారతి



బీజేపీలో ఫైర్ బ్రాండ్‌గా పేరున్న నేత ఉమాభారతి. 2003 డిసెంబర్ నుంచి 2004 ఆగస్టు వరకు మధ్యప్రదేశ్ తొలి మహిళా సీఎంగా పనిచేశారు. 2005లో వివిధ కారణాలతో బీజేపీ నుంచి ఆమె బహిష్కరణకు గురయ్యారు.

- 2006 ఏప్రిల్ 30న ‘భారతీయ జనశక్తి పార్టీ’ని ఉమా భారతి స్థాపించారు. బీజేపీ హిందుత్వ అజెండా నుంచి పక్కకు జరుగుతున్నదని భావించి, పూర్తిస్థాయి హిందుత్వ సిద్ధాంతంతో పార్టీని ప్రారంభించినట్టు ఆమె చెప్పారు.
- ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా బలమైన హిందుత్వ ఎజెండాను అమలు చేయడం.. అయోధ్యలో రామమందిర నిర్మాణం, సామాజిక న్యాయ పాలన అందించడం.. ఓబీసీల హక్కుల కోసం పోరాడటం వంటివి నాడు ఉమా భారతి పార్టీ లక్ష్యాలు. 2008లో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ.. 4.7% ఓట్ల సాధన.
- 2009లో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినా ఒక్క సీటు కూడా సాధించలేదు. అనంతరం ఉమాభారతి మళ్లీ మాతృ సంస్థ బీజేపీ వైపు చూశారు. 2011 జూన్‌లో భారతీయ జనశక్తి పార్టీని బీజేపీలో విలీనం చేశారు.

## జయలలిత



తమిళనాడు రాజకీయాల్లో ‘పురచ్చి తలైవి’గా చక్రం తిప్పిన ధీర వనిత జయలలిత. 1949లో సీఎన్ అన్నాదురై ద్రావిడ మున్నేట్ర కళగం (డీఎంకే) పార్టీని ఏర్పాటు చేశారు. నాడు ఆ పార్టీలో రచయిత కరుణానిధి, నటుడు ఎంజీఆర్ ప్రముఖ నేతలుగా ఉన్నారు. అన్నాదురై మరణం తర్వాత పార్టీ నాయకత్వంలో విభేదాలు వచ్చాయి. పార్టీ నుంచి ఎంజీఆర్ బయటకు వచ్చి.. 1972 అక్టోబర్ 17న అన్నా ద్రావిడ మున్నేట్ర కళగం (ఏడీఎంకే )పార్టీని స్థాపించారు. డీఎంకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడటం, తమిళ సంస్కృతి, భాషా ప్రయోజనాలను కాపాడటం దీని ప్రధాన లక్ష్యాలు.

- 1982లో ఎంజీఆర్ పార్టీలో జయలలిత చేరారు. ఆయన మరణం తర్వాత ఏఐడీఎంకే పార్టీ పగ్గాలు చేపట్టారు.
- 1989 టైమ్ లో కరుణానిధి సీఎంగా ఉన్నప్పుడు అసెంబ్లీలో జయలలితపై దాడి జరిగింది. చిరిగిన చీరతో ఆమె బయటకు వచ్చారు. ‘‘ఈ అవమానానికి ప్రతీకారం తీర్చుకుని, సీఎంగా తిరిగి ఈ అసెంబ్లీలో అడుగుపెడతాను” అంటూ నాడు శపథం చేశారు. అన్నట్లుగానే 1991లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తొలిసారి జయలలిత ముఖ్యమంత్రి అయ్యారు. తమిళనాడుకు ఆమె రెండో మహిళా సీఎం. అంతకు ముందు ఎంజీఆర్ మరణం తర్వాత కేవలం 23 రోజులు ఆయన భార్య జానకీ రామచంద్రన్ సీఎంగా పని చేశారు.
- 2001లో రెండోసారి జయలలిత సీఎం అయ్యారు. కోర్టు కేసుల కారణంగా కొన్నాళ్లకు ఆ పదవి నుంచి తప్పుకున్నారు. తన అనుచరుడు పన్నీర్ సెల్వంను సీఎం చేశారు. 2002లో ఉపఎన్నికలో గెలిచి మళ్లీ సీఎంగా జయలలిత బాధ్యతలు చేపట్టారు. 2011లో నాలుగోసారి ఆమె అధికారంలోకి వచ్చారు. కోర్టు కేసుల నుంచి నిర్దోషిగా బయటకు వచ్చి 2015లో ఐదోసారి మళ్లీ సీఎంగా జయలలిత బాధ్యతలు చేపట్టారు. 2016 డిసెంబర్ 5న తమిళనాడు ముఖ్యమంత్రిగానే ఆమె కన్నుమూశారు.

## శశికళా కకోద్కర్



గోవా తొలి మహిళా ముఖ్యమంత్రి శశికళా కకోద్కర్. ఆమె తండ్రి ఆ రాష్ట్ర తొలి సీఎం దయానంద్ బందోద్కర్ 1963 మార్చి 6న మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ (ఎంజీపీ)ని స్థాపించారు. పోర్చుగీస్ పాలన నుంచి గోవా విముక్తి పొందాక మహారాష్ట్రలో విలీనం చేయడం ఈ పార్టీ ప్రధాన లక్ష్యం.

- 1973లో దయానంద్ బందోద్కర్ మరణించిన తర్వాత శశికళా కకోద్కర్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 1979లో పార్టీలో అంతర్గత తిరుగుబాటు కారణంగా ఆమె ప్రభుత్వం పడిపోయింది. 1980 ఎన్నికల్లో పార్టీ ఓడిపోయింది.
- 2016 అక్టోబర్ లో శశికళ కకోద్కర్ 81వ ఏట అనారోగ్యంతో కన్నుమూశారు.
- గోవాను దాదాపు 17 ఏళ్ల పాటు (1963 –1979) ఏకధాటిగా పాలించిన ఎంజీపీ ప్రస్తుతం పూర్వ వైభవాన్ని కోల్పోయింది. ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీలో 2 సీట్లకు పరిమితమైంది.

## మాయావతి



దేశ రాజకీయాల్లో 'దళిత ఐకాన్ 'గా పేరొందారు మాయావతి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగుసార్లు పనిచేశారు. దేశంలో ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తొలి దళిత మహిళగా ఆమె రికార్డు సృష్టించారు.

- 1984లో కాన్షీరామ్ స్థాపించిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) లో మాయావతి వ్యవస్థాపక సభ్యురాలిగా చేరారు. ఆమె వాక్చాతుర్యం, పోరాట పటిమను చూసి కాన్షీరామ్ తన రాజకీయ వారసురాలిగా చేశారు.
- 1989లో తొలిసారి లోక్‌సభకు మాయావతి ఎన్నిక. 2003లో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలిగా బాధ్యతలు.
- 1995 జూన్‌లో బీజేపీ మద్దతుతో తొలిసారి ఉత్తరప్రదేశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన మాయావతి. అప్పుడు నాలుగు నెలలే ముఖ్యమంత్రిగా కొనసాగారు.
- రెండోసారి 1997 మార్చి - సెప్టెంబర్ బీజేపీ మద్దతు, అధికార మార్పిడి ఒప్పందంలో 6 నెలలు సీఎంగా పనిచేసిన మాయావతి. మళ్లీ బీజేపీ మద్దతుతో 2002 - 2003 వరకు సుమారు ఏడాదిన్నర పాటు ముఖ్యమంత్రిగా చేశారు.
- అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తి మెజారిటీ సాధించి 2007 – 2012 వరకు నాలుగోసారి తన సొంత బలంతో యూపీకి సీఎం అయిన మాయావతి. ప్రస్తుతం బీఎస్పీ చీఫ్‌గా కొనసాగుతున్నారు.

## వసుంధర రాజే



రాజస్థాన్ రాజకీయాల్లో 'మహారాణి'గా పేరొందారు వసుంధర రాజే సింధియా. ఆమె రెండు పర్యాయాలు అక్కడ సీఎంగా చేశారు.

- వసుంధర రాజే.. గ్వాలియర్ రాజ కుటుంబానికి చెందినవారు. ఆమె తల్లి విజయరాజే సింధియా బీజేపీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. వసుంధర రాజే 1984లో బీజేపీలో చేరారు. వివిధ కీలక పదవులు చేపట్టారు.
- 2003లో రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుతో తొలి మహిళా సీఎంగా వసుంధర రాజే బాధ్యతలు చేపట్టారు. 2013 ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించి రెండోసారి ఆమె సీఎం అయి రికార్డు సృష్టించారు.
- 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినప్పటికీ వసుంధర రాజేకు పదవి దక్కలేదు. ప్రస్తుతం ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.


## మెహబూబా ముఫ్తీ



జమ్మూ కాశ్మీర్ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన మహిళా నాయకురాలు మెహబూబా ముఫ్తీ. ఆమె ఆ రాష్ట్ర తొలి మహిళా ముఖ్యమంత్రి.

- కాంగ్రెస్ ను వీడి ముఫ్తీ మహమ్మద్ సయీద్ 1999లో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పీడీపీ) ని స్థాపించారు. జమ్మూ కాశ్మీర్ ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చడానికి, కాశ్మీర్ సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనడానికి పార్టీని ఏర్పాటు చేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల తర్వాత పీడీపీ, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ముఫ్తీ మహమ్మద్ సయీద్ ముఖ్యమంత్రి అయ్యారు.
- తండ్రి ముఫ్తీ మహమ్మద్ సయీద్ మరణానంతరం మెహబూబా ముఫ్తీ 2016 ఏప్రిల్ లో జమ్మూకాశ్మీర్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2018 జూన్ వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు. 2018లో బీజేపీ మద్దతు ఉపసంహరించుకోవడంతో ఆమె ప్రభుత్వం పడిపోయింది. ప్రస్తుతం పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా మెహబూబా ముఫ్తీ కొనసాగుతున్నారు.

## వీకే శశికళ



తమిళనాడు రాజకీయాల్లో 'చిన్నమ్మ'గా పేరొందిన వివేకానందన్ కృష్ణవేణి (వీకే) శశికళ తాజాగా ' ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కళగం' పేరిట సొంత పార్టీని ప్రకటించారు. 2026 ఫిబ్రవరి 24న జయలలిత జయంతి సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. మార్చి 13న పార్టీ పేరును ప్రకటించారు.

- జయలలిత వారసత్వాన్ని కాపాడటం, ఆమె ఆశయాలను కొనసాగించడం, ద్రవిడ సిద్ధాంతాలకు అనుగుణంగా పేదలు, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేయడం శశికళ పార్టీ లక్ష్యాలు. గతంలో ఏఐడీఎంకే పగ్గాలు చేపట్టాలని ప్రయత్నించిన ఆమె.. అనంతరం జైలు శిక్ష అనుభవించారు. ఇప్పుడు కొత్త పార్టీని ఏర్పాటు చేశారు.
- ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో శశికళ పార్టీ పోటీచేస్తున్నది. ఇటీవలే రామదాస్ నేతృత్వంలోని పీఎంకే తో పొత్తు ఖరారు. రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయం.
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గతంలో శశికళకు శిక్ష పడటం కారణంగా ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఆమె 2027 వరకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హురాలు. అయినా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె కింగ్ మేకర్ పాత్ర పోషించాలని చూస్తున్నారు.



## నౌహేరా షేక్



హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత్రి నౌహేరా షేక్ 'ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్' పార్టీని 2017 నవంబర్ 12న న్యూఢిల్లీలో లాంచ్ చేశారు. ఈమె ఏపీలోని తిరుపతికి చెందిన వ్యాపారవేత్త.

- కుల, మత, ప్రాంతాలకు అతీతంగా మహిళల అభ్యున్నతి కోసం పనిచేయడం, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు, చట్టసభల్లో మహిళలకు ఎక్కువ సీట్లు దక్కాలనేది ఈ పార్టీ లక్ష్యాలు.
- 2018లో కర్ణాటక అసెంబ్లీ, 2018లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బరిలోకి దిగినా ప్రభావం చూపలేదు.
- 2024లో లోక్‌సభ ఎన్నికల్లో కూడా పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపిన నౌహేరా షేక్ . నాడు హైదరాబాద్ నుంచి అసదుద్దీన్ ఒవైసీపై పోటీ చేస్తానని ప్రకటించి, ఆ తర్వాత విరమించుకున్న నౌహేరా షేక్.
- నౌహేరా షేక్ రాజకీయ ప్రస్థానంతో పాటు ఆమె వ్యాపార సామ్రాజ్యం (హీరాగోల్డ్) చుట్టూ అనేక వివాదాలు నెలకొన్నాయి. మనీ లాండరింగ్, మోసం కేసుల్లో అప్పట్లో ఆమెను ఈడీ, పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవలే ఆమె మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నారు.